

కలబురగిలో జయదేవ ఆసుపత్రి ప్రారంభంలో సీఎం సిద్ధరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు

కలబురగిలోనే హృద్రోగ చికిత్స

- బెంగళూరు జయదేవకు వెళ్లాల్సిన అవసరం లేదు
- కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సచివాలయం
- హామీలన్నీ నెరవేరుస్తాం: సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రాంత ప్రజలు హృద్రోగ చికిత్సకు బెంగళూరు వెళ్లాల్సిన అవసరంలేదని, ఇకపై కలబురగిలోనే సేవలు పొందవచ్చని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఆదివారం కలబురగిలో 371 పడకలతో నిర్మించిన జయదేవ హృద్రోగ ఆసుపత్రిని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ పాటిల్, కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి చైర్మన్ అజయ్‌సింగ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఆసుపత్రి ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి బహిరంగసభలో మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం 371 జే ఆర్టికల్ ప్రారంభమై పదేళ్లు అవుతోందన్నారు. కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి కట్టుబడ్డామని అందుకు అనుగుణంగానే ప్రత్యేక సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు అనుగుణంగానే జయదేవ ఆసుపత్రిలో 371 పడకలతో సిద్ధం చేశామన్నారు. ఇకపై కలబురగితోపాటు అనుబంధ జిల్లాల ప్రజలు హృద్రోగ సమస్యలకు బెంగళూరు జయదేవ ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కొత్త సంవత్సరం జనవరి ప్రారంభం నుంచే ఆసుపత్రిలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అంతకు ముందు సభలో మాట్లాడిన మల్లికార్జున ఖర్గే ప్రతిపాదనలకు సీఎం స్పందించారు. కలబురగిలో నిమ్హాన్స్ డయాబెటాలజీ విభాగాలను ప్రారంభించాలనే ప్రతిపాదనకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. కలబురగితోపాటు మైసూరుకు కూడా నిమ్హాన్స్ విభాగం అవసరమని అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్‌పాటిల్‌కు సీఎం ఆదేశించారు. ఆర్టికల్ 371జే ద్వారా ఈ ప్రాంతంలో వేలాదిమంది విద్యావంతులకు ఉద్యోగాలు సాధ్యమవుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం ఉత్తర కర్ణాటకతోపాటు సమగ్ర కర్ణాటక అభివృద్ధికి బ్లూ ప్రింట్ సిద్ధం చేసిందన్నారు. ఇది తమ ప్రభుత్వం విధానమన్నారు. కల్యాణ కర్ణాటకలో ఖాళీగా ఉండే పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీతో పాటు కొత్త కోర్సులను తీసుకొస్తామన్నారు. అంతకుముందు సీఎంను కలిసేందుకు వచ్చిన రైతులు కందిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌కు స్పందించారు. నివేదిక తెప్పించుకుని పరిశీలిస్తామన్నారు. మీడియాతో మాట్లాడినవేళ అనుభవమంటపం సగం పూర్తయ్యిందని, మిగిలిన నిర్మాణాలు వేగవంతంగా ముగించాలని ఆదేశించామని అవసరమైన గ్రాంట్లను విడుదల చేశామన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతానికి జయదేవ ఆసుపత్రి ఎంతో ప్రయోజనకరం కానుందన్నారు. విధానపరిషత్ సంఘటనపై స్పందిస్తూ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల బీజేపీ సభ్యుడు సీటీ రవి వ్యాఖ్యలు క్రిమినల్ నేరమన్నారు. బీజేపీ జాతీయ కమిటీలో పనిచేసిన సీటీ రవి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.



కలబురగిలో జయదేవ ఆసుపత్రి





ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కావేరి నది

కలుషితమైన నది..!

- రాష్ట్రంలో 13 నదుల నీరు కాలుష్యమయం.. ● పరిశ్రమల వ్యర్థాలతో ప్రమాదకరం ● కాలుష్యమండలి నివేదికలో వెల్లడి

బెంగళూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగర ప్రాంతాలే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని నదులు కూడా కలుషితమయ్యాయి. ఇలా ఏకంగా 13 నదుల నీరు తాగేందుకు కాదు... కనీసం వాడకానికి కూడా ప్రమాదమేనని కాలుష్యనియంత్రణ మండలి నివేదికలో వెల్లడైంది. రాష్ట్రంలో ప్రముఖ నదుల నీరు కలుషితమైందని ఇందులో స్పష్టం చేస్తోంది. శుద్ధీకరణ లేకుండా వాడకం కూడా సాధ్యం కాదని తేల్చింది. వీటిలో కృష్ణ, కావేరి, తుంగభద్ర, బీమా, భద్ర, తుంగ, కబిని, శింషా, అర్కావతి, లక్ష్మణతీర్థ, నేత్రావతి, దక్షిణ పినాకిని నదులు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రముఖమైన నదుల్లో కృష్ణ, కావేరి, తుంగభద్రలు కీలకమైనవి. వీటిద్వారానే రాష్ట్రంలో సగభాగానికిపైగా తాగునీటికి ఉపయోగిస్తారు. ఇలా ఏడు ప్రముఖ నదులలో వాటిలో విలీనమయ్యే 20 ఉపనదులు కూడా ఉన్నాయి. 80శాతానికిపైగా నదులు పశ్చిమకనుమల్లోనే ఉద్భవిస్తాయి. ఈ నదుల ద్వారా 3,700 టీఎంసీలకుపైగా నీరు ప్రవహిస్తుంది. అయితే కాలుష్య నియంత్రణ మండలి నివేదిక మేరకు వీటిలో 13 నదులు కలుషితమయ్యాయని పేర్కొంది.



గుర్రపుడెక్కతో నిండిన అర్కావతి నది

అర్కావతి అత్యంత కలుషితం

కేంద్ర, రాష్ట్ర కాలుష్యనియంత్రణమండలి అధ్యయనం ప్రకారం అర్కావతి నది అత్యంత ఎక్కువ కలుషితమైనదిగా నిర్ధారించింది. తాగేందుకు ఉపయోగించే లీటరు నీటిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ప్రమాణం 5 మిల్లీ గ్రాములు లేదా అంతకంటే తక్కువ ఉండాలి. కానీ 30మిల్లీ గ్రాములకంటే ఎక్కువ ఉంది. భద్ర, తుంగభద్ర, శింషా నదులలో బీఓడి 6-10 మిల్లీ గ్రాములు ఉండగా మిగిలిన 8 నదుల్లో 6మిల్లీ గ్రాములు ఉన్నట్టు నివేదికలో పేర్కొంది.

693 కిలోమీటర్ల మేర కాలుష్య ప్రదేశం

కాలుష్యనియంత్రణ మండలి అధ్యయనం ప్రకారం రాష్ట్రంలోని 12 నదులు 693 కిలోమీటర్ల మేర కాలుష్యం ప్రబలుతున్నట్లు నిర్ధారించారు. 112 ప్రదేశాల్లో కలుషితమవుతున్నట్లు గుర్తించారు. వ్యర్థాలు పడేయడం ద్వారా కలుషితం అవుతున్న నీటిని ప్రతిరోజూ 817 మిలియన్ లీటర్లు శుద్ధీకరించాల్సి వస్తోంది. ప్రస్తుతం 657.69 ఎంఎల్‌డీల నీరు శుద్ధీకరించేందుకు 40 శుద్ధీకరణ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. 195.75 ఎంఎల్‌డీల నీరు శుద్ధీకరించే సామర్థ్యం కల్గిన 16 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఇంకా 53.28 ఎంఎల్‌డిల నీటి శుద్ధీకరణకు 15 ఎస్‌టిపిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

దక్షిణ పినాకిని కూడా..

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, దక్షిణ పినాకిని, అఘనాశిని, శరావతి, గంగావళి నదులు కలుషితమయ్యాయని రెండేళ్లక్రిందటే గుర్తించింది. శుద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. కేంద్ర మండలి నివేదికను ఆధారంగా చేసుకుని ఇటీవలే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మరోసారి సర్వే చేసింది. అఘనాశిని, శరావతి, గంగావళి నదులు కలుషితం కాలేదని, అయితే దక్షిణ పినాకిని నది నీరు తీవ్రమైన కలుషితం అయ్యాయని శుద్ధీకరణ తప్పనిసరి అని సూచించింది. రాష్ట్రంలో ఉద్భవించే నదులన్నీ పశ్చిమ కనుమలకు అనుబంధంగా విస్తారంగా ఉండే అటవీ, కొండల ప్రాంతాలలో ఉన్నాయి. పశ్చిమకనుమలు కాలుష్యం అనే పదానికి సంబంధం లేదనేలా విస్తారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పుట్టే నదులు పశ్చిమకనుమలు దాటేదాకా కొనసాగుతాయి. పశ్చిమ కనుమలలోనే అనుబంధ నదులు కలుస్తాయి. అయితే జిల్లాల మీదుగా సాగే ప్రాంతంలోనే పరిశ్రమలనుంచి, జనావాసాల నుంచి వ్యర్థాలు, కలుషితాలు నీటిలో చేరుతున్నాయి. ఇదే తీవ్రమైన ప్రభావానికి కారణమవుతోందని కాలుష్యనియంత్రణ మండలి నిర్ధారించింది.



క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తున్న సీఎస్ఐఆర్ బృందం

తుంగభద్ర క్రస్ట్‌గేట్ల
పరిశీలన
- నమూనాల సేకరణ
- కొత్త గేట్ల ఏర్పాటుపై త్వరలో తుది నిర్ణయం
6

రాష్ట్రంలో
మినీ టిబెట్
- ఆరు దశాబ్దాలుగా బౌద్ధుల కొలువు...
- ఆకట్టుకుంటున్న వారి జీవన విధానం
7



ఒడెయరపాళ్యలో వెలసిన బౌద్ధ క్షేత్రం


కన్నడ భాషాభివృద్ధికి కట్టుబడదాం

- సాహిత్య సమ్మేళనంలో ఐదు తీర్మానాలు ● త్వరలో దావణగెరెలో విశ్వకన్నడ సమ్మేళనం ● తదుపరి కార్యక్రమం బళ్లారిలో..

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషాభివృద్ధికి కట్టుబడదామని ప్రతి కన్నడిగుడు భాషా పరిరక్షణకు అంకితభావంతో వ్యవహరించాలని అప్పుడే భాషకు ప్రాధాన్యం పెరుగుతుందని సమ్మేళనాధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప పిలుపునిచ్చారు. ఆదివారం మండ్యలో జరుగుతున్న 87వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం ముగిసింది. కన్నడ సాహిత్య పరిషత్ గౌరవ కోశాధ్యక్షుడు పటేల్‌పాండు ఐదు నిర్ణయాలను ప్రకటించారు. అందులో కన్నడ భాష సమగ్ర అభివృద్ధి బిల్లు వెంటనే అమలు చేయాలని ప్రతిపాదించారు. స్వయం ప్రతిపత్తి కల్గిన కన్నడ సాహిత్య పరిషత్‌కు ఎన్నికైన అధ్యక్షుడిని కన్నడ భాష సమగ్ర అభివృద్ధి బిల్లు 2022 ప్రకారం రాష్ట్రస్థాయి ఉపాధ్యక్షుడిగా నియమించేలా సవరణ తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కన్నడ భవనం, గ్రంథాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఖాళీగా ఉండే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, కన్నడేతర పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. కన్నడ అనేది భాష అయ్యేందుకు కన్నడిగుల ఉద్యోగానికి అడ్డుగా మారేలాంటి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రభుత్వం సమగ్రంగా ఎదుర్కోవాలని, సరోజిని మహిషి నివేదికను చట్టబద్ధంగా అమలు చేయాలని సూచించారు. కర్ణాటక ప్రభుత్వం జాతీయ కవిని వెంటనే ప్రకటించాలని కోరారు. దావణగెరెలో జరగాల్సిన విశ్వకన్నడ సాహిత్య సమ్మేళనాన్ని కేంద్ర కన్నడ సాహిత్య పరిషత్ సహకారంతో వెంటనే అమలు చేయాలని సూచించారు.

సమ్మేళనంలో సాగుపై చైతన్యం

సమ్మేళనంలో సాహిత్య అభిమానులకు, ప్రజలకు సాగుపై చైతన్యం కలిగించేలాంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వరి, సిరిధాన్యాల ఉత్పత్తులు సమగ్ర సమాచారాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా కేంద్రం విద్యార్థులు, శాస్త్రవేత్తలు సందర్శకులకు సమాచారం ఇచ్చారు. వంగడాల ప్రాధాన్యం, సాగు యంత్రాలు, ఉద్యానవన, పట్టుసాగు, అటవీ, పశుసంవర్థక, మత్స్యశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కర్ణాటక మండ్య రాగి (కేఎంఆర్) వంగడాన్ని, ఇండాఫ్ రాగి వంగడాలు చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు.



సమ్మేళనం వేదికపై గొ.రు.చన్నబసప్ప తదితరులు

సినీరంగానికి మండ్య సేవలు అపారం

కన్నడ సినిమా, నాటకరంగానికి మండ్య జిల్లా సేవలు అపారమని ప్రముఖ గేయ రచయిత వీ నాగేంద్రప్రసాద్ అభిప్రాయపడ్డారు. సినీరంగంలో రాణించిన విష్ణువర్ధన్, అంబరీశ్, రమ్య, నీనాసం సతీశ్, జోగి ప్రేమ్ వంటివారి ఇక్కడివారేనన్నారు. సినిమారంగంపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నాటకరంగంలో మళవళ్లి సుందరమ్మ, రాజ్‌కుమార్‌లకు బేడరకణ్ణప్ప సినిమా ద్వారా అవకాశం కల్పించిన హెచ్‌ఎల్ఎన్ సింహ ఇదే జిల్లాకు చెందినవారన్నారు. ఇందిరా డ్రామా, హళ్ళికేశ్వర మార్కెట్, కొడియాళ డ్రామాలు కర్ణాటకలోనే కాకుండా తమిళనాడులోనూ ప్రాధాన్యం పొందాయన్నారు. అధ్యాపకురాలు కెంపమ్మ జానపద అంశానికి సంబంధించి సుదీర్ఘంగా వివరించారు. అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కృష్ణగౌడ మాట్లాడుతూ అర్థవంతంగా సమ్మేళనం జరిగిందన్నారు. సమ్మేళనంలో పుస్తకాల కొనుగోళ్లకు అన్నివర్గాలు ఆసక్తి చూపాయి. విద్యార్థులైతే గంటల తరబడి బుక్‌స్టాల్స్‌లోనే గడిపారు. తమకు నచ్చిన పుస్తకాలు కొనుగోలు చేశారు.

మండ్యలో పోరాటం-మార్పునకు నాంది

మండ్యలో స్వాతంత్ర్యానంతరం జరిగిన ఎన్నో పోరాటాలు మార్పునకు నాందిగా మారాయని, ప్రస్తుతం సాహిత్య సమ్మేళనం ద్వారా సామాజిక, సాంస్కృతిక రంగంలో అపారమైన మార్పుకు కారణం కానుందని ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య అభిప్రాయపడ్డారు. రైతు, దళిత, విప్లవ, గోకాక్ వంటి పోరాటాలు జరిగాయని, కర్ణాటక ఏకీకరణ విషయంలో సమగ్రమైన పోరాటానికి మండ్యలో పునాది అయ్యిందన్నారు. రైతుల సమస్యలకోసం నిరంతరంగా పోరాటం చేసిన ప్రొఫెసర్ ఎండి నంజుండస్వామి, ప్రొఫెసర్ కేఎస్ పుట్టణ్ణయ్య జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందారన్నారు.



కేంద్రమంత్రి కుమారస్వామికి జ్ఞాపిక బహూకరణ

దావణగెరెలో విశ్వకన్నడ సాహిత్య సమ్మేళనం

దావణగెరెలో జరపతలపెట్టి విశ్వకన్నడ సాహిత్య సమ్మేళనానికి త్వరలోనే రూపురేఖలు సిద్ధం చేయాలని సభలో తీర్మానించారు. మండ్యలో సమ్మేళనం విజయవంతమైన తరహాలో దావణగెరెలోనూ సాహిత్య అభిమానంతో అమలు చేయాలని నిర్ణయించారు. సాధారణంగా సమ్మేళనం ముగింపురోజు తదుపరి సంవత్సరం ఎక్కడ జరపాలనేది నిర్ణయించే సంప్రదాయానికి అనుగుణంగానే చివరిరోజు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌జోషి ప్రకటించారు. బళ్ళారిలో 88వ సాహిత్య సమ్మేళనం జరగనుందని ప్రకటించారు.

ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కుమారస్వామి

సాహిత్య సమ్మేళనం ముగింపు ఉత్సవాలలో కేంద్రమంత్రి కుమారస్వామి పాల్గొన్నారు. చివరిరోజు కేంద్రమంత్రి కుమారస్వామి భాగస్వామ్యులయ్యారు. ఇటీవల కొంతకాలంగా రాజకీయంగా బద్ధశత్రువులుగా కొనసాగుతున్న కేంద్రమంత్రి కుమారస్వామి, రాష్ట్రమంత్రి చలువరాయస్వామి ఒకే వేదికపై ఉన్నా ఒకరికొకరు పలకరించుకోలేదు.



సమ్మేళనం ప్రాంగణంలో సందడి



బుక్‌స్టాల్స్‌లో సందర్శకులు

వివాదంగా మారిన మాంసాహారం పంపిణీ

సాహిత్య సమ్మేళనం ప్రక్రియ ప్రారంభం నుంచి మాంసాహారం సమకూర్చాలనే డిమాండ్‌కు అనుగుణంగా చివరి రెండు రోజులు ఏకంగా ప్రాంగణంలోనే పంపిణీ చేశారు. సామాజిక ఉద్యమకారులు కొందరు శనివారం గుడ్డు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం సభా ప్రాంగణంలో రాగిముద్ద, కోడి కూర, గుడ్డు పంపిణీ చేశారు. కాసేపట్లోనే వందలాదిమందికి అందజేశారు. 500 మందికి పంపిణీ చేయదలిచామని ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉంటే 5 లక్షలమందికి సమకూర్చేవారమన్నారు. కన్నడ తల్లికి శాకాహారం, మాంసాహారం తినేవారంతా ఒక్కటేనని, ఇక్కడ బేధాభిప్రాయాలు ఎందుకని పలువురు మండిపడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని మాంసాహారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమ్మేళనానికి వారం రోజుల ముందునుంచే ఈ వివాదం సాగుతోంది. సమ్మేళనంలో మాంసాహారం పంపిణీ చేయాలని తొలుత డిమాండ్ చేశారు. సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సాధ్యం కాదని ప్రకటించిన మేరకు కొన్ని చోట్ల నిరసనలు కూడా నిర్వహించిన విషయం విదితమే. ఇంటికో కోడి, పల్లెకో గొర్రె నినాదంతో పోరాటం చేశారు.



మాంసాహార పంపిణీని అడ్డుకుంటున్న పోలీసులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.33	1,589.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1201	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,203	869
నీటి నిల్వ (టీఎంసీలు)	87.92	10.82

తుంగభద్ర గేట్లను పరిశీలించిన సీఎస్ఐఆర్ నిపుణులు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర క్రస్ట్‌గేట్లను నిపుణుల బృందం పరిశీలిచింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్, ఇండ్రస్టియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ విభాగానికి చెందిన ఐదుగురు నిపుణులు శనివారం తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించారు. జంషెడ్‌పూర్‌లోని మెటీరియల్స్ ఇంజనీరింగ్ ల్యాబొరేటరీకి చెందిన హేమేంద్రనాత్ నేతృత్వంలోని బృందం తుంగభద్ర జలాశయానికి చెందిన 33 క్రస్ట్‌గేట్లను రెండు గంటలపాటు పరిశీలించారు. ఒక్కో గేటులో ఉపయోగించిన పదార్థాల నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను కూలంకుషంగా పరిశీలన జరుపుతున్నట్లు, గేట్ల ప్రామాణిక, ఉపయోగం, అత్యవసరంగా మార్చే అవకాశం ఉందా అన్న విషయాలు పరీక్షల అనంతరం తెలుస్తుందని నిపుణుల బృందం పేర్కొన్నారు. అనంతరం కొత్తగేట్ల ఏర్పాటు గురించి ప్రక్రియ ప్రారంభించనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలన నిమిత్తం విచ్చేసిన జాతీయ ఆనకట్టల సురక్షతా ప్రాధికార నిపుణుల అనకట్ట సామర్థ్యం పరీక్షలు జరపాలని తెలిపిన నేపథ్యంలో మరోమారు పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నిపుణుల బృందంతో పాటు బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఇంజనీరు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మఠం చెరువులో మొసళ్ల ప్రత్యక్షం

రాయచూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా సోమలాపురం పంచాయతీ పరిధిలోని అంభమఠం వద్ద ఉన్న తాగునీటి చెరువులో రెండు మొసళ్లు శనివారం ప్రత్యక్షమయ్యాయి. ఇటీవల చెరువలో మొసళ్లు ఉన్నట్లు గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు వచ్చిన సమయంలో అవి కనిపించకపోవడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇటీవల చెరువుల్లో నీళ్లు కొంత కలుషితం కాగా మొత్తె చెరువును ఖాళీ చేసేందుకు మఠం ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా చెరువులో నీటిని క్రమక్రమంగా తొలగిస్తుండగా ఆదివారం రెండు మొసళ్లు ప్రత్యక్షం అయ్యాయి. ఆందోళన చెందిన గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రత్యక్షంగా మొసళ్లను తిలకించిన అధికారులు వాటిని బంధించి నదిలో వదిలేందుకు ఏర్పాట్లు చేపట్టారు.



మఠం చెరువులో కనిపించిన మొసలి



నగరంలోని రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో కుక్కలను బంధిస్తున్న నగరపాలక సిబ్బంది

వీధి కుక్కలను పట్టేశారు..

రాయచూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల కుక్కల దాడిలో యువతి మృతి చెందడంపై అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. విచ్చల విడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు నగరసభ అధికారులు ముమ్మర కార్యాచరణ చేపట్టారు. ఆదివారం నగరసభ సిబ్బంది నగరంలో జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి వీధి కుక్కలను నిర్బంధించే పని చేపట్టారు. ఇప్పటి వరకు నగర పరిధిలో 2000 పైగా కుక్కలను నిర్బంధించి వాటికి సంతాన నియంత్రణ చికిత్స చేసినట్లు నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య తెలిపారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 50కి పైగా కుక్కలకు ఈ రకమైన చికిత్స చేపట్టామన్నారు. నగరంలో ప్రధాన వీధులుగా ఉండే సెంట్రల్ బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రధాన రహదారి కూడళ్ల వద్ద పెద్ద ఎత్తున నగరసభ సిబ్బంది వీధి కుక్కలను నిర్బంధంలోకి చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల్లో చలనం వచ్చిందని అభినందిస్తున్నారు.

గుత్తి కోట కట్టడాలు అద్భుతం

గుత్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుత్తికోట కట్టడాలు అద్భుతమని స్థానిక సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి పేర్కొన్నారు. చారిత్రాత్మకమైన అనంతపురం జిల్లాలోని గుత్తి కోటను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆంగ్లేయులు, అప్పటి దత్తమండలాల కలెక్టర్ సర్‌థామస్ మన్రో సమాధులను పరిశీలించారు. అనంతరం కోట కట్టడాలను, కోటపై భాగంలో ఉన్న గుర్రపు, ఏనుగు శాలలు, చీకటి గదులు, రంగమఠం, బావులు, రాణి మహల్ తదితర కట్టడాలను పరిశీలించారు.



గుత్తికోటను పరిశీలిస్తున్న న్యాయాధికారి

కారును ఢీకొన్న బస్సు

సిరుగుప్ప, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం దేవి నగర్ గ్రామం వద్ద కారు బస్సును ఢీకొనడంతో ప్రయాణికులు ఆందోళనకు లోనయ్యారు. కారును రోడ్డు ఎక్కించే సమయంలో బస్సు రావడంతో వెనుకల భాగంలో కారును ఢీకొంది. కారు కంట్రోల్ కాకపోవడంతో పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవరు, కండక్టర్ ప్రయాణికులను సిరుగుప్పకు తరలించారు.



ప్రయాణికులను తరలిస్తున్నఆర్టీసీ సిబ్బంది

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● ఎమ్మెల్సీ వసంత్ కుమార్

రాయచూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డల్లో శ్రవణ దోషాన్ని కనిపెట్టేందుకు తల్లిదండ్రులు వారి పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎమ్మెల్సీ వసంత్ కుమార్ సూచించారు. ఏడాది కాలం గడిచే వరకు పిల్లల్లో శ్రవణ దోషం ఉన్నట్లు గుర్తించడం కష్టమని దాని పై ప్రత్యేక నిఘా అవసరమన్నారు. వైద్యకియ విజ్ఞాన సంస్థ, నగరసభల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గాజగారపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రవణ దోష చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ వసంత్ కుమార్ బాలల్లో శ్రవణ దోషం ఉన్నట్లు గుర్తించడం కష్టమని ఇందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు బాలల్లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రైవేటు పరంగా ఇలాంటి వైద్య చికిత్సలందించడం ఖర్చుతో కూడిన పని కావడంతో ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆరోగ్య పరంగా అనేక పథకాలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వాటి ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వసంత్‌కుమార్



విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంధన అభివృద్ధి మండలి చైర్మన్ సురేంద్ర

వ్యవసాయ విజ్ఞాన కేంద్రం పరిశీలన

బళ్లారి డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రాన్ని కర్ణాటక రాష్ట్ర జీవ ఇంధన అభివృద్ధి మండలి చైర్మన్ సురేంద్ర ఆదివారం సందర్శించి కేంద్రంలోని అధికారులతో చర్చించారు. జిల్లావ్యాప్తంగా బయో ఫ్యూయల్ ప్రాజెక్టుల గురించి రైతులు, ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలకు పరిచయం చేయడంలో హగరి కృషి విజ్ఞాన కేంద్రం విజయవంతమైందని కొనియాడారు. బయోడిజిల్ ఉత్పత్తి కర్మాగారాన్ని సందర్శించిన రాష్ట్రపతి, యంత్రాలు శిథిలావ్యవస్థకు చేరుకున్నాయని గమనించిన వెంటనే సాంకేతిక నిపుణులను పంపుతామని హామీ ఇచ్చారు. కేంద్రంలోని బయోఫ్యూయిల్ ప్లాంటేషన్‌ను సందర్శించి వర్షాధారం కోసం నిర్మించిన కొండలను పరిశీలించారు. బయో-ఇంధన రంగాన్ని అప్‌గ్రేడేషన్, వాణిజ్యకరణ కోసం బోర్డు చేపడుతున్న ప్రాజెక్టులు, నిర్మాణాత్మక ప్రాజెక్టుల గురించి చైర్మన్ వివరించారు. బయోడీజిల్, 2జీ ఇథనాల్‌తోపాటు బయోగ్యాస్ సీబీజీ బయోఫ్యూయిల్ రంగంలో రానున్న కాలంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం బయో ఫ్యూయల్‌పై విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్తలు గిరీష్, రవికుమార్, వ్యవసాయ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన భక్తులు



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న మాలధారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్ప ఆలయాన్ని భక్తులు శుభ్రం చేశారు. శబరి అయ్యప్ప ట్రస్టు 42వ మహా మండల పూజా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప మాలధారులు, కరసేవలో పాల్గొని ఆలయాన్ని శుద్ధి చేశారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త జయప్రకాష్ గుప్త నాయకత్వం వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసంవత్సరం 42వ మహామండలి పూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అయ్యప్పను దర్శించుకుని దీవెనలు పొందాలన్నారు. శబరి అయ్యప్పట్రస్టు సభ్యుడు మంజునాథ్, మహేశ్, స్థానిక భక్తులు శ్రీనివాస్,పురుషోత్తం,హరీష్‌రాజు, రామ్‌కిరణ్, చంద్రమౌళి, హులుగప్ప, హొన్నూరు స్వామి, హరీశ్, రాఘవేంద్ర,దుర్గేశ్, ,దనుష్‌సాయి, వెంకటసాయి, మహేశ్ పాల్గొన్నారు.

గోశాలకు గడ్డి వితరణ



గడ్డి ట్రాక్టర్‌ను గోశాలకు తరలిస్తున్న దాతలు

బళ్లారి సిటీ,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారతీయరెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రముఖ కంటీ వైద్యులు నాగరాజురావ్ ఆదివారం బళ్లారిలోని గోశాలకు ట్రాక్టర్ గడ్డిని విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు రావ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తన పొలం నుంచి గడ్డిని అందజేస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం లభించడం కష్టమైన ఈరోజుల్లో మూగజీవులను కడుపు నింపడమే ధ్యేయమన్నారు. దేవణ్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గోసేవకు ముందుకు రావాలన్నారు. ఈసందర్భంగా వైద్యులు రాగరాజురావ్, రెడ్‌క్రాస్ సంస్థ షకీబ్, సతీశ్, రక్తదానం చైర్మన్ బి.దేవణ్ణ, వలిబాషా పాల్గొన్నారు.

సూర్యసిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ హరికుమార్ తదితరులు

బళ్లారి సిటీ,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణపేట శనేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం జ్యోతిష్యరత్న గురురాజు కులకర్ణి గారి గౌతమ సూర్య సిద్దాంత క్యాలెండర్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ హరికుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురురాజ కలకర్ణి 14 సంవత్సరాల నుంచి క్యాలెండర్లను అందుబాటులో ఉంచుతున్నారన్నారు. వీరి సమాజ సేవా అమూల్యమని తెలిపారు. తదుపరి సూర్యనారాయణ శర్మ భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఈసందర్భంగా సంగీత కార్యక్రమాలు జరిగాయి. ఏరియా కార్పొరేటర్ అశోక్‌కుమార్, మాధవ దిగ్గవి,వ్యాసరాజాచార్, ప్రసాద్, శ్రీనివాస్ హునగుండ్, సామాజిక కార్యకర్త గిరి పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో అఖిల భారత్ 15వ వార్షికోత్సవం

● కర్ణాటక బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నాగభూషణ



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధికారులు

బళ్లారి సిటీ, డి సెంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు నగరంలోని కమ్మభవనంలో 15వ వార్షికోత్సం నిర్వహిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు నాగభూషణ, ప్రధాన కార్యదర్శి బన్నిగోళ టి.జీ.విఠల్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో గ్రామీణ బ్యాంక్ ప్రారంభమై సుమారు 50 సంవత్సరాలు అయిందన్నారు. బళ్లారిలో సమ్మేళనం నిర్వహించడం హర్షణీయ మన్నారు. అఖిల భారతస్థాయిలో 43 గ్రామీణ బ్యాంకులు 11లక్షల 75వేల కోట్ల టర్నోవర్ చేస్తోందన్నారు. దేశంలో ఎస్‌బీఐ తర్వాత రెండవ అతి పెద్ద బ్యాంకు అయిందన్నారు. దేశంలోని గ్రామీణ బ్యాంకుల్లో 67వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలన్నారు. రైతులకు సేవే లక్ష్యంగా గ్రామీణ బ్యాంకులు కృషి చేస్తున్నాయన్నారు. బ్యాంకులను గ్రామీణులు ప్రోత్సహించాలన్నారు. సమ్మేళనాన్ని సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ ప్రారంభిస్తారన్నారు.

హోసూరు జోన్

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ మునుస్వామి తదితరులు

హోసూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా వేపనపల్లి శాసనసభ నియోజకవర్గం శూలగిరి వెస్ట్ యూనియన్ సింపిల్‌తిరాడి పంచాయతీ ఆరుపల్లి గ్రామంలో నియోజకవర్గ నిధులతో రూ.17.20 లక్షలతో 30 వేల లీటర్ల సామర్థ్యంతో చేపట్టిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణపనులను ఎమ్మెల్యే కేపీ మునుస్వామి ప్రారంభించారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమానికి శూలగిరి యూనియన్ ఇన్‌చార్జ్ చెన్నపల్లి పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు, యూనియన్ కమిటీ మాజీ సభ్యుడు సెల్వం, శూలగిరి పశ్చిమ యూనియన్ కార్యదర్శి జిల్లా పంచాయతీ ప్రాజెక్టు కమిటీ సభ్యుడు వెంకటాచలం బాబు నేతృత్వం వహించారు. వేపనపల్లి వెస్ట్ యూనియన్ కార్యదర్శి శైలేష్‌కృష్ణన్, అన్నాడీఎంకే నియోజకవర్గ జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు పెరియన్నన్, శివరాజు, మారండపల్లి పంచాయతీ అధ్యక్షుడు వెంకటేశ్, చెన్నబసమ్మ, నీలకంఠన్, శ్రీనివాసన్, యూనియన్ కమిటీ సభ్యుడు పళని, శూలగిరి ఈస్ట్ యూనియన్ కోశాధికారి మునికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు దంతాల స్వాధీనం.. నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు.. నిందితులు

హోసూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ఏనుగులను వేటాడి ఏనుగుల దంతాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ధర్మపురి మండల కన్సర్వేటర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హోసూరు వనకోట వైల్డ్‌లైఫ్ కన్సర్వేటర్ బాగన్ జగదీశ్ సుధాకర్ ఆదేశాల మేరకు హోసూరు అటవీశాఖ అధికారి పార్థసారథి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది ఆదివారం కార్యాచరణ చేపట్టారు. హోసూరు ఈఎస్ఐ రింగురోడ్డు సర్కిల్ ప్రాంతం పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రెండు ఏనుగు దంతాలు గుర్తించారు. ఇరుదుకోట్టై సమీపంలోని తిప్పనూర్‌కు చెందిన వెంకటేశ్ (27), కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ సమీపంలోని మారనాయకనహళ్ళికి చెందిన విజయకుమార్ (25), ఊత్తంగరై పుదూర్‌కు చెందిన హరిపువతి (39), నారాయణనగర్‌కు పరంధామన్(27) అనే నలుగురిని అరెస్ట్ చేసి ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో ఇందుకు సంబంధం ఉన్న అయూరుకు చెందిన మునిరాజు(29), తొల్వపేట గ్రామానికి చెందిన లింగప్ప(39)ను అరెస్టు చేశారు. అలాగే ఈ కేసులో పరారీల్లో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితులు బెట్టముగిలాళం పక్కన బొప్పనూరుకు చెందిన బసప్ప, జయపురంనకు చెందిన మధురికల కోసం అటవీశాఖ అధికారులు గాలింపులు చేపట్టారు.

రింగ్‌రోడ్డు నిర్మాణానికి అనుమతులపై బీజేపీ హర్షం



ఉత్తర్వులను చూపుతున్న బీజేపీ నాయకులు

హోసూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు యాక్సెస్ రోడ్డును నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు ఇవ్వడం సంతోషంగా ఉందని తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి సి.నరసింహన్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర భూ ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. కర్ణాటక తరహాలో రైతులకు ఎకరానికి రూ.3కోట్లు పరిహారం ఇచ్చేందుకు తమిళనాడు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇందుకు రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు సమాచారం అందిందన్నారు. సమావేశంలో కృష్ణగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, పి.ఎంకే జిల్లా మాజీ అధ్యక్షుడు కార్యదర్శి అరుణ్‌రాజ్, రైతు సంఘ అధ్యక్షుడు మునివెంగటప్ప, రవీంద్రనాథ్, బీజేపీ ఇన్‌చార్జులు రామలింగం, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



ప్రముఖులను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

హోసూరు(సిప్‌కాట్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో కమ్యూనిటీ రైట్ టు లైఫ్ ఆర్గనైజేషన్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమాలు అర్థవంతంగా జరిగాయి. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త కార్తీక్ శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ జోన్ చైర్మెన్ జయప్రకాశ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కేక్ కట్ చేసిన అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. భర్త కోల్పోయిన మహిళలకు, భర్త వదిలేసిన మహిళలకు ప్రోత్సాహక ధనాన్ని అందచేశారు. విజయభాస్కర్, శబరీశన్, సాయి కిరణ్ సెందమిళ్ చేరన్, సుబ్రహ్మణ్యం, మూర్తి, కుమరన్, కార్తీక్ వేలు, గోకుల్, నవీన్, శరత్‌కుమార్, న్యాయవాది ఆనందన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం

హోసూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో రాధాకృష్ణుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాధాకృష్ణ భజనమండలి ట్రస్టు 33వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఉత్సవాలు జరిగాయి. ఈనెల 20న సాయంత్రం వినాయక పూజ, విష్ణుసహస్ర నామ పారాయణతో ప్రారంభించి అష్టపదు, దాశరతి కీర్తనలు, దివ్యనామ సంకీర్తన నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం ఆదివారం రాధాకల్యాణ మహోత్సవం జరిగింది. ప్రైవేట్ కళ్యాణ మంటపంలో మూడు రోజులపాటు కార్యక్రమాలు సాగాయి. మురళీధర భాగవతార్ నేతృత్వంలో కృపా మండలిచే నామ సంకీర్తన జరిగింది.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బలిజేపల్లి లక్ష్మీకాంతం (జయంతి)




స్వాతంత్ర్య సమరయోధులు, అవధాని బలిజేపల్లి లక్ష్మీకాంతం 1881 డిసెంబరు 23న గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా ఇటికంపాడులో జన్మించారు. నాటక రచయితగానే కాక రంగస్థల, సినిమా నటులుగా రాణించారు. నాటక సమాజం ద్వారా సత్యహరిశ్చంద్రీయ, ఉత్తర రాఘవాది నాటకాలు పలుమార్లు ప్రదర్శించారు. వాటిలో వేషాలు ధరించి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. 1953 జూన్ 30న పరమపదించారు.

పీవీ నరసింహారావు (వర్ధంతి)



దేశ ప్రధానిగా పదవి అధి రోహించిన దక్షిణాది తొలి తెలుగువాడు పాములపర్తి వేంకట నరసింహారావు 1921 జూన్ 28న వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలో జన్మించారు. పీవీగా సుపరిచితులు. దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను గాడినపెట్టారు. 1957లో ఎమ్మెల్యేగా రాజకీయ జీవితం ప్రారంభించి మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా అత్యున్నత హోదాలలో కొనసాగారు. అపర చాణక్యుడిగా పేరొందారు. బహుభాషా కోవిదుడైన ఆయనకు 17 భాషలు వచ్చు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయి పడగలుకు హిందీ అనువాదం 'సహస్రఫణ్' రాయగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. 2004 డిసెంబరు 23న కన్నుమూశారు.

జీఎస్ శివరుద్రప్ప (వర్ధంతి)



ప్రముఖ కన్నడ కవి గుగ్గరి శాంత వీరప్ప శివరుద్రప్ప 1926 ఫిబ్రవరి 27న శివమొగ్గ జిల్లా శికారిపుర తాలూకా ఈసూరు గ్రామంలో జన్మించారు. జీఎస్ఎస్‌గా సుపరిచితులైన ఆయన విమర్శకులు, పరిశోధకులు, నాటకకారుడు, ప్రాధ్యాపకులుగా గుర్తింపు పొందారు. గోవిందపై, కువెంపుల తర్వాత 'రాష్ట్రకవి' గౌరవాన్ని అందుకున్నారు. సమన్వయ కవిగా పేరొందారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో రీడర్‌గా, కన్నడ విభాగాధిపతిగా సేవలందించారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో ప్రాధ్యాపకులుగా, డైరెక్టర్‌గా సుదీర్ఘకాలం కొనసాగారు. ఆయన పాలనలో కన్నడ విభాగం, కన్నడ అధ్యయన కేంద్రంగా అభివృద్ధి చెందింది. రిటైర్మెంట్ అనంతరం మైసూరు యూనివర్సిటీలో కన్నడ ప్రాధ్యాపకురాలిగా సేవలందించారు. దావణగెరెలో జరిగిన అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షులుగా గౌరవం పొందారు. 2013 డిసెంబరు 23న కన్నుమూశారు.

మంజునాథ నాయకర్ (పుట్టినరోజు)



మంజునాథ నాయకర్ 1976 డిసెంబరు 23న జన్మించారు. దర్శకుడు శంకర్‌నాగ్ నేతృత్వంలో రూపొందించిన మాల్గుడి డేస్ (1987)లో స్వామి పాత్రతో పేరొందారు. కన్నడ, తెలుగు, హిందీ భాషలలో 68 సినిమాలలో నటించారు. ఒక అంతర్జాతీయ, ఒక జాతీయ, ఒక రాష్ట్ర అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం సొంతంగా పీఆర్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు.

మూడేళ్లలో వంద ఏజెన్సీ శాఖల లక్ష్యం

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో 18 కొత్త ఏజెన్సీ శాఖలను ప్రారంభించామని రానున్న మూడేళ్లలో ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈఓ రుషభ్‌గాంధీ వెల్లడించారు. బెంగళూరులో సంస్థ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రానున్న మూడేళ్లలో వంద ఏజెన్సీలు దేశవ్యాప్తంగా ప్రారంభించదలిచామన్నారు. బ్యాంకుల ద్వారా ఇన్సూరెన్స్ వ్యవహారాలకు అనుగుణంగా సేవలు విస్తరింపచేయదలిచామన్నారు. ఏజెన్సీ విభాగం అధ్యక్షుడు సుమిత్‌సాహి అభిప్రాయం మేరకు పాన్ ఇండియా విస్తరణ దిశగా అన్ని రాష్ట్రాల్లోనూ సేవలు అందుబాటులోకి తీసుకురాదలిచామన్నారు. దేశంలోని ప్రధాన బ్యాంకులలో అనుసంధానంగా పనిచేస్తున్నామన్నారు. ఇటీవలికాలంలో జీవితబీమా పట్ల ప్రజలలో అవగాహన పెరిగిందని అందుకు అనుగుణంగా వ్యాపారాలను విస్తారం చేస్తూనే అన్నివర్గాలకు సేవలందించదలిచామన్నారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య

అప్పులు తిరిగి చెల్లించకపోవడంతోనే..!

కూడేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో భాస్కర్‌బాబు (53) అనే ఉపాధ్యాయుడు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు డి.హీరేహాళ్ మండలం మలికేతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భాస్కర్‌బాబు అనంతపురంలో నివాసముంటున్నాడు. బుక్కరాయసముద్రం మండ లం వెంకటాపురం గ్రామానికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి, అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న శ్రీనివాసులుకు ఈయన రూ.60 లక్షల వరకు డబ్బులు అప్పు ఇచ్చాడు. వారు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు ఎలా కట్టాలని మథనపడ్డాడు. ఈక్రమంలోనే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయాడు. ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లోకి వెళ్లాడు. ఆత్మహత్య చేసుకునే ముందు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసుల నుంచి రూ.60 లక్షలు ఇప్పించాలని పోలీసులను వేడుకుంటూ సూసైడ్ లెటర్ రాశాడు. తర్వాత పురుగుల మందు తాగి పడిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఉపాధ్యాయుడిని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కూడేరు మండలం హంసాయపల్లిలో టీచర్‌గా పనిచేస్తున్నారు.

రాష్ట్రంలో మినీ టిబెట్

ఇక్కడ బౌద్ధ సన్యాసుల జీవనం

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వారాంతం అయ్యిందంటే చాలు ప్రముఖ పర్యాటక స్థలాల సందర్శనకు వెళ్లేందుకు ఉత్సాహం చూపే సంప్రదాయం పెరుగుతోంది. రాష్ట్రంలో హిందువులు పూజించే ప్రముఖ శైవక్షేత్రాలు కోకొల్లలుగా ఉన్నాయి. అదే తరహాలోనే జైన సంప్రదాయానికి అనుగుణమైన ఆలయాలకు కొదవ లేదు. ఇలా హిందూ, జైనుల ఆలయాలు దక్షిణభారత్‌లో ప్రతిచోటా కనిపిస్తాయి. కానీ బౌద్ధసన్యాసులు వేలాదిమంది నివసించే ప్రాంతం కూడా రాష్ట్రంలో కొలువై ఉంది. బెంగళూరు నుంచి చెన్నై, చామరాజనగరలవైపు ప్రయాణించేవారు మినీ టిబెట్‌గా పిలిచే ప్రాంతాన్ని సందర్శించవచ్చు. దేశంలో బౌద్ధ దేవాలయాలు బిహార్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్‌లతోపాటు హిమాలయ ప్రదేశాలలో అత్యధికంగా ఉన్నాయి. నేపాల్, టిబెట్‌లలో బౌద్ధులే అత్యధికంగా నివసిస్తున్నారు.

ఆరు దశాబ్దాలుగా..

1959లో టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న వేళ బౌద్ధ ధర్మ గురువు దలైలామాతోపాటు సుమారు 80వేలమంది టిబెటియన్లు భారత్, నేపాల్, భూటాన్‌లలో 58 ప్రాంతాలకు వలస వెళ్లారు. అలా కర్ణాటక రాష్ట్రం చామరాజనగర జిల్లా కొళ్ళేగాల తాలూకాలోని ఒడెయరపాళ్యలోనూ బౌద్ధులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యవసాయం, చేతివృత్తుల ద్వారా జీవనం సాగిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం బౌద్ధులకు ప్రత్యేకమైన పాఠశాల, కళాశాలతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇలా ఒడెయరపాళ్యకు అనుబంధంగా ఉండే సుమారు 22 గ్రామాలలో బౌద్ధులు నివసిస్తున్నారు. ఈ ఊళ్లకు ప్రత్యేకమైన పేర్లు లేవు. కేవలం అక్షరాలతోనే పిలుస్తారు. ఇక్కడివారు వరి, రాగి, జొన్నలాంటి పంటలు పండిస్తారు.

బౌద్ధులకోసం ఏడు మఠాలు

బౌద్ధులు ప్రార్థనలు చేసుకోవడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అనుగుణంగా 7 మఠాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిలో జోక్సన్ మఠం, తక్షమ్, థానక్, థ్రాసియల్, బైయో మఠంతో కలిపి 7 ఉన్నాయి. బౌద్ధ ధర్మ ఆచారాలు కొనసాగిస్తారు. బెంగళూరు నుంచి కనకపుర రోడ్డు, రాష్ట్ర హైవే 94 మీదుగా కొళ్ళేగాలకు వెళ్తే ఒడెయరపాళ్య చేరుకోవచ్చు. మరోవైపు జాతీయ రహదారి 44, 275ల మీదుగా కూడా వెళ్లే అవకాశం ఉంది. 44మీదుగా అయితే హోసూరు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. 275 ద్వారా అయితే కొళ్ళేగాలకు వెళ్లి రూటు మార్చు కోవాల్సి ఉంటుంది. కొళ్ళేగాల నుంచి ఒడెయరపాళ్యకు మినీ రోడ్ల ద్వారా ప్రయా ణించే వెసలుబాటు ఉంది. ఆర్టీసీ బస్సులు అనుకూలంగా ఉన్నాయి. బౌద్ధ సంప్రదాయాలు చూడాలనుకునేవారికి ఓ విహార కేంద్రంగాను ఉంది. కాగా కొడగు జిల్లా కుశాలనగర పరిధిలోని బైలకుప్పలో బౌద్ధులకు సంబంధించిన గోల్డెన్ టెంపుల్ కూడా ప్రత్యేక ఆకర్షణగా ఉంటోంది.



విమానాశ్రయంలో భువనేశ్వరితో టీడీపీ ఫోరం సభ్యులు

భువనేశ్వరితో టీడీపీ ఫోరం సభ్యుల భేటీ

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు విచ్చేసిన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరితో టీడీపీ ఫోరం సభ్యులు భేటీ అయ్యారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి ఆమెకు ఫోరం సభ్యులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఫోరం చేస్తున్న కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. ఇదే సందర్భంగా త్వరలో నిర్వహించే సంక్రాంతి సంబరాలకు విచ్చేయాలని ఆమెను ఆహ్వానించారు.

రాజాజీనగర్‌లో రేణుకా ఎల్లమ్మదేవికి హోమాలు

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజాజీనగర్‌లో రేణుకా ఎల్లమ్మదేవికి హోమాలు జరిపారు. ఆదివారం అమ్మవారికి పూజలు, జపంతోపాటు సహస్రనామ పారాయణ, పూర్ణాహుతి జరిపారు. అర్చకుడు ప్రాణేశ్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు జరిగాయని నిర్వాహకులు డాక్టర్ కుమార్ కెంచేగౌడ తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన రేణుకా ఎల్లమ్మదేవి ఆరాధకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.47 కోట్లతో రహదారుల అభివృద్ధి



భూమిపూజలో మంత్రి మునియప్ప, మంత్రి సతీశ్ జార్కిహొళి తదితరులు

విజయపుర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని రోడ్లను రూ.47 కోట్లతో అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంకతట్టి నంజుండప్ప సర్కిల్ నుంచి శిడ్లఘట్ట క్రాస్ వరకు చతుష్పథ సీసీ రోడ్డు, డాంబరీకరణ పనులు కొనసాగించనున్నట్టు తెలిపారు. దేవనహళ్ళి పట్టణం కెంపేగౌడ సర్కిల్ నుంచి రాణి సర్కిల్‌వరకు చతుష్పథ రోడ్డు రూ.2.5కోట్లతోను, దేవనహళ్ళి తాలూకా జాతీయ రహదారి 207నుంచి కారహళ్ళికి చేరే మార్గం కొయిరా, మాయసంద్ర, మీసగానహళ్ళి, తైలగెరె రింగ్ రోడ్డు వరకు 3.6 కిలోమీటర్ల నుంచి 10.6 కిలోమీటర్ల వరకు రూ.1.5 కోట్లతో ఆయా ప్రాంతాలలో మరు డాంబరీకరణ పనులు ఉంటాయన్నారు. దేవనహళ్ళి తాలూకా రాష్ట్ర రహదారి 170పై నంది గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు వెళ్లే విజయపుర, శిడ్లఘట్ట, దిబ్బూరహళ్ళి, ఇ.తిమ్మసంద్ర, చేళూరు రోడ్డు మార్గాలలో చతుష్పథ సీసీ రోడ్డు పనులు, దేవనహళ్ళి తాలూకా బెంగళూరు - నంది రోడ్డుపై మళ్ళీ తారు వేసే పనులు ఉంటాయన్నారు. ఇలా పలు ప్రాంతాలలో రోడ్లను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక కమిషన్ అధ్యక్షుడు నారాయణస్వామి, బయప అధ్యక్షుడు శాంతకుమార్, సభ్యులు మంజునాథ్, ప్రసన్న, విజయకుమార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన యాగం

బాగేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గడిదంలో లోక కల్యాణార్థం సుదర్శన మహావిష్ణు యాగం భక్తిశ్రద్ధలతో జరిగింది. 30మంది వేదపండితులో వివిధ ధార్మిక కైంకర్యాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కే ప్రకాశ్‌రావ్ నేతృత్వంలో బెంగళూరుకు చెందిన వివిధ సేవాకర్తల సహకారంతో ఆదివారం తెల్లవారుజామునుంచే పలు పూజా కైంకర్యాలు కొనసాగాయి. షష్టిగణపతిపూజ, రక్షాబంధన, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, ఆయుష్య, నక్షత్ర సర్పహోమం, భూనీళా లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, వైజయంతి విజయలక్ష్మీ సహిత సుదర్శన మహావిష్ణు చక్రానికి తిరుమంజనం, 10 గంటలకు హోమం, మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ యాగం జరిగిదన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విశేషపూజల్లో భక్తులతో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

విద్యతో అర్థవంతమైన జీవితానికి పునాది



స్నాతకోత్సవంలో గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్ళై, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి తదితరులు

దొమ్మసంద్ర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది కేవలం జీవనానికి మార్గదర్శకమే కాదని అర్థవంతమైన జీవితానికి పునాది అని గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్ళై అభిప్రాయపడ్డారు. అలయెన్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా గోవా గవర్నర్ పాల్గొనగా గౌరవ అతిథిలుగా పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే పాల్గొన్నారు. 1,145మంది యూజీ, పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. గవర్నర్ ప్రసంగిస్తూ గుణాత్మక విద్యతోపాటు క్రమశిక్షణ పాటించడం ద్వారా కుటుంబీకులు, మార్గదర్శకుల సహకారంతో విజయం సాధ్యమన్నారు. అలయెన్స్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ప్రిస్లీశాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం

మహదేవపుర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఓవం ఆసుపత్రి ముఖ్యులు డాక్టర్ ఆదర్శ్ సోమశేఖర్ తెలిపారు. నియోజకవర్గంలోని బూదిగెరె క్రాస్ వద్ద ఆసుపత్రి డేకేర్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. గత పదేళ్లలో తమ ఆసుపత్రిలో 16వేల కాన్పులు నిర్వహించామన్నారు. హొస్కోటె శాఖలో 3వేలకుపైగా శిశు సంరక్షణ చికిత్సలు అందించామన్నారు. ప్రిమెచ్యూర్డ్ బేబీలు, తక్కువ బరువు కల్గిన శిశువులకోసం ప్రత్యేక విభాగం ఉందన్నారు. నిపుణులైన వైద్యులతో మెరుగైన చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. ఓవం ఫౌండేషన్ ద్వారా అన్నివర్గాలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ మురళిమోహన్, డాక్టర్ రాజేశ్, భాగ్యలక్ష్మిరావ్ తదితరులు పాల్గొన్నారు.

అణ్ణమ్మదేవి పూజలో మంత్రి



మంత్రి బైరతి సురేశ్ తదితరులు

హెబ్బాళ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే, నగరాభివృద్ధి మంత్రి బైరతి సురేశ్ స్థానిక గంగానగర్ ఆర్‌బిఐ లేఅవుట్‌లో గజానన యువజనసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన నగరదేవత అణ్ణమ్మదేవి పూజల్లో పాల్గొన్నారు. కెహెచ్ ఎం బ్లాక్‌లోని గంగానగర క్రీడా, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సీబీఐ రోడ్డు వసంతప్పబ్లాక్ 6వ క్రాస్‌లో కొలువుదీర్చిన అణ్ణమ్మదేవికి విశేషపూజలు నిర్వహించారు. మంత్రి బైరతి సురేశ్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

హునుకుంద పంచాయతీ అధ్యక్షురాలిగా పద్మ



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో సభ్యులు తదితరులు

బంగారపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హునుకుంద గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా పద్మ రెడ్డప్ప, ఉపాధ్యక్షురాలిగా రుక్మిణమ్మ వెంకటేశప్పలు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి వెంకటేశప్ప ప్రకటించారు. తాలూకాలోని హునుకుంద గ్రామ పంచాయతీలో ఖాళీ అయిన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు మూడో విడత ఎన్నికలు జరిగాయి. అధ్యక్షస్థానానికి నేత్రావతి, పద్మ రెడ్డప్ప పోటీ చేయగా నేత్రావతికి 5 ఓట్లు, పద్మ రెడ్డప్పకు 6 ఓట్లు దక్కడంతో ఒక ఓటు ఆధికత్యంతో అధ్యక్ష స్థానం దక్కించుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా రుక్మిణమ్మ ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు గోవిందప్ప మాట్లా డుతూ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు గ్రామ ప్రముఖుల తరపున అభినందించారు. ఎమ్మెల్యే నారాయణస్వామి సహకారంతో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపు సాధించారన్నారు. నూతన అధ్యక్షురాలు పద్మరెడ్డప్ప మాట్లాడుతూ తన విజయానికి కారకులైన ఎమ్మెల్యేకు, గ్రామపంచాయతీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అందరి సహ కారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాటు పడతానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు, సభ్యుడు రంజిత్‌కుమార్, సభ్యులు వెంకటేశప్ప, రంగ మ్మ, సుకన్య, కాంగ్రెస్ ప్రముఖులు నారాయణగౌడ, చలపతి, నాగరాజ్, ఆనంద్ పాల్గొన్నారు.

శోకసంద్రంలో సాంగ్లి జిల్లా మొరబగి

సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ కుటుంబీకుల అంత్యక్రియలు

చంద్రయాగప్ప సేవలను స్మరించుకున్న గ్రామస్థులు

బెంగళూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లాకు సరిహద్దున మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా జత్ తాలూకా మొరబగి గ్రామంలో ఆదివారం సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ చంద్రయాగప్ప కుటుంబీకుల అంత్యక్రియలు జరిగాయి. తెల్లవారుజామున 3 అంబులెన్స్‌లలో మృతదేహాలను తరలించారు. గ్రామస్థులంతా మృతదేహాలను చూసి కంటతడిపెట్టారు. గ్రామంలో నిశ్శబ్ద వాతావరణం చోటు చేసుకుంది. వారి పొలంలోనే చంద్రయాగప్ప సోదరుడు మల్లికార్జున అంత్యక్రియల ప్రక్రియ జరిపారు. సమీప గ్రామస్థులతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మిత్రులు పాల్గొన్నారు. గ్రామానికి ఎప్పుడో ఒకసారి వచ్చిన అందరినీ పలకరించేవారని గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. చదువుకున్న గ్రామస్థులను బెంగళూరుకు తీసుకెళ్లి ఉద్యోగాలు ఇప్పించారని, గ్రామంలో ఎన్నో కుటుంబాలకు ఆదర్శంగా నిలిచిన చంద్రయాగప్పను ఇంటింటా స్మరించుకున్నారు. ఈ ప్రాంతంలోని సుమారు 10 గ్రామాలలో అవసరాలకు చంద్రయాగప్ప అండగా ఉండేవారని పలువురు అభిప్రాయపడ్డారు. బెంగళూరు శివారులోని నెలమంగల దగ్గర చంద్రయాగప్ప కుటుంబీకులు ప్రయాణిస్తున్న కారుపై కంటైనర్ బోల్తా పడ్డంతో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. చంద్రయాగప్ప సహా కుటుంబీకులందరినీ కోల్పోవడంతో మొరబగి గ్రామంలో నైరాశ్యం నెలకొని శోకసంద్రంగా మారింది. కడ చూపుకోసం చుట్టుపక్కలనుంచి తరలి వచ్చి సంతాపం తెలిపారు.

సహకార సంఘం భవనానికి రూ.2లక్షల విరాళం

శిడ్లఘట్ట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చీమంగల పరిధిలోని తాటిఎర్తి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం భవనానికి ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ రూ.2లక్షలు విరాళం ప్రకటించింది. సదరు మొత్తాన్ని మంజూరు చేసినట్టు సంఘం తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ఆర్‌బీఐ నియమాలకు అనుగుణంగా స్వసహాయసంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు కల్పిస్తోందన్నారు. కాగా సామాజిక సేవలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పాలడెయిరీ భవనాలు, దేవాలయాల జీర్ణోద్ధరణ, పాఠశాల తరగతి గదులకు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇస్తున్నామన్నారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు మునికృష్ణప్ప మాట్లాడుతూ ధర్మస్థళ యోజనా సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నంజప్ప, డైరెక్టరలు తిమ్మక్క, రత్నమ్మ, నరసింహయ్య, డివిజన్ అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయంపై పత్రం అందజేత

ప్రవాసాంధ్రుల ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ అభిమానులు

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చెందిన ప్రవాసాంధ్రుల టీడీపీ సభ్యత్వ నమోదు శనివారం నగరంలో జరిగింది. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచనల మేరకు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు నేతృత్వంలో బనశంకరిలోని విహారకేంద్రంలో నియోజకవర్గ పార్టీ అభిమానుల సమావేశం జరిగింది. చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ అభిమానులంతా సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. వేణుగోపాల నాయుడు, భీమినేని సురేశ్, గుత్తా అమరనాథ్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు. సభ్యత్వాల రుసుం చెల్లించేందుకు కపిల్‌తో పాటు పలువురు ముందుకొచ్చారు. కార్యక్రమంలో బోడపాటి రాజగోపాలనాయుడు, కిషన్‌చంద్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.08కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

నాలుగు తాలూకాలు టౌన్‌షిప్‌గా తీర్చేందుకు ప్రతిపాదన



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి మునియప్ప తదితరులు

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర నగరసభ పరిధిలో రూ.1.08 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మునియప్ప ప్రారంభించారు. తాలూకా పంచాయతీ ఆవరణలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, యోజనా ప్రాధికార అధ్యక్షుడు చుంచేగౌడ, నగరసభ అధ్యక్షురాలు సుమిత్ర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరోత్థాన పథకం కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు మరింత గ్రాంటు విడుదల చేయాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ జిల్లాలోని నాలుగు తాలూకాలను టౌన్‌షిప్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఉంచామన్నారు. ఈ సందర్భంగా నగరసభ ఉపాధ్యక్షుడు మల్లేశ్, జడ్పీ సీఈఓ డాక్టర్ కేఎస్ అనురాధ, తహసీల్దారు విద్యారాథోడ్, కమిషనర్ కార్తీక్ ఈశ్వర్, తాలూకా పంచాయతీ ఈఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.